# గాలి మేఘాలు ★

రచన : షేక్ మస్తాను

మా వివాహం జరిగి దాదాపుగ నాలుగేళ్ళు అవుతుంది. ఈ జరిగిపోయిన నాలుగేళ్ళలో మాకు సంతతి అనేది పేరుకైనా నతింగ్. అంటే రావడంగాని పోవడంగాని, పుట్టడంగాని గిట్టడంగాని, అసలేలేదు. దేవునిదృష్టిలో మేం యేం పాపదోషం చేశామో మనకైతే గుర్తులేదుగాని, నా యావిడకుమాత్రం ఏ కొద్దిపాటిగానో గుర్తున్నట్లుగా అపుడపుడూ నాతో శయ్యామందిరంలో అంటూవుండేది. ఇది మాత్రం నాకు బహు బాగా గుర్తు. ఆమెచేసిన మహా గొప్ప పాపకార్యం ఏమిటీ? అంటే, తన చిన్నతనంలో వారింట్లో వున్న నులకమంచాలలోని నల్లుల్ని, వారింట్లోవున్న గజ్జి కుక్కవంటిపైనున్న జోరీగల్ని, చాలా చంపిందని ఆ పాప ఫలితంగానే తమకీనాడు సంతతిలేదో! అని నాతో అంటూ వుండేది నావైపు. కాని, నావరకు నాకు బిడ్డలులేక పోతేనే మెరుగనిపించేది. అంటే నేనేం బ్రహ్మరాకసినికాదు. హృదయములేని కఠినుణ్ణి అంతకన్నా కాను. ఈ పాడుమూక పుట్టినదగ్గరనుండి ఒకటే పీకులాట గోల, వారిని పోషించి పెద్దవారినిచేసి యేడ్చేసరికి, మనప్రాణాలుపోవడం అటుంచి, ముందు మన సర్వసుఖాలు మంటకలిసి బూడిదపాలై పోతాయి. ఇపుడైతే హాయి బలే హాయి. బల్ మజాగ ఈ చలికాలం కలికాలాన్ని మర్చి, బహు బాగుగా పవ్వళించ వచ్చు. భానుడు ఉదయించేది అస్తమించేది అసలే జాన్తా నహి. పిల్లలుంటే కీ...బ్యా...ఒకటే కాకిగోల. రామరామ మా యింటిప్రక్కన ఒక కుటుంబముంది హత్తెరి ఒకడే సుపుత్రుడు వాడి సిగతరగ వాడు రాత్రిళ్ళు నిదురపోడు. పగలు పడుకోనివ్వడు. మరి ఆ భార్యా భర్తల గోడు ఎలా తీరాలి అంటా.

మా కా బెడద యేమీలేదు. దేవుని దయవల్ల నాకు మాణిక్యంలాటి భార్య దొరికింది. హాయి బలే హాయి. మా వివాహం జరిగిన ప్రథమాంకములో మా కులాసాలన్ని బలే ఉల్లాసంగా జరిగిపోయింది. మా అత్తగారు నిలువెత్తు పందిరి మంచమిచ్చారు. ఆ మంచానికి చుట్టూ దోమతెఱ దింపించే యిచ్చారు. మమ్మిద్దరిని ఆ తెఱలో 'ఘోషా'గా చచ్చిబ్రతక మని ఆశీర్వదించి పంపేశారు.

మా యావిడ బహురూపసి. రంభను మించిన రంభ. అందచందాలలో చంద్రుని మరిపిస్తుంది. సన్నని వాలుజడ వేసి, ఆ జడలో యిన్ని మల్లె దవనంపేర్చి, మూడు రంగుల రిబ్బనుతో అల్లికవేసి, ఎర్రవాయిలుచీర ధరించి, ఆ చీరకు తగినట్లు నీలపురంగు జాకెట్ తొడిగి, వాకిట్లో నిలుచుంటే, హు........నా భార్యవంకగాని, మచ్చగాని వుంటుందా ? అలాటి ఆమెను అసలు నిదురపోనిచ్చేవాడినా? అసలామెను చూడంగానే నాకు ఎక్కడలేని చలివేసుకొచ్చేది. అసలు అన్న ఆహారాలు తిననిచ్చేవాడినా? పొద్దస్తమానం నా సరసన కూర్చోమని మంకుపట్టుపట్టి పిల్లవానిలాగు మారాంవేసే వాడిని. ఆమె నన్నేం కోరితే నేను నిమిషాలలో అమర్చే వాడిని. నేనామెను ఏది ఎపుడు కోరితే అపుడే అమర్చి ఆదరించి అనందపరిచేది, ఇలా సాగేది మా అనురాగదాంపత్య జీవితనౌక.

ఇలాగే ఏలాటి ఒడుదుడుకులు రాకుండా రెండేండ్లు సాగింది మా ప్రేమ పుష్పరథం. మూడవ యేడు మా వ్యవహారం కాస్త ముతుకబారింది. "మ్రాను ఎంతకాలం చిగిర్చక పుష్పపూయక, కాయకాయక, కాచినకాయ పండక" వుంటుంది మరి. అలాగే నా పత్ని ధర్మపత్ని అర్ధాంగియైన పద్మ గర్భం ధరించి కూర్చుంది. నీరసం, నిరుత్సాహం, ఆయాసం మొదలైన వెధవ వేషాలతో వుస్సు...అస్సు... యిస్సు, అన మొదలెట్టింది, దీంతో మనకు స్వర్గ సుఖాలన్నీ మందకోడి తనంగా మారింది. వెధవది అలవాటు పడినది కనుక మనసు. నా మనసు మరీ చికాకు పడిపోసాగింది. అయినా యిక నేనామెను తాక వీలు లేదాయె మరి. ప్రసవసమయ మాసన్నమైంది. నా హృదయంలో నుండి, నేత్ర ఫలకముల నుండి జల జల మంటూ ప్రవాహం రాసాగింది. ఏ మొస్తే మాత్రం ఏం లాభం. మరి మూడు నాలుగు మాసాల పాటు నా పట్ట మహిషిని చే పట్ట రాదాయెను.

ఇలా నా మనసులోని బాధలతో నేను చస్తుంటే. నాకు పిల్లను యిచ్చిన అత్తగారు "దయ్యం" లాగున ఆ రోజునే వేం చేసింది. ఎందుకూ? నా హృదయ పద్మమును తీసు కెళ్ళుటకు. చచ్చినంత పనైంది. అసలే కుమిళి పోతూంటే "సవాశేరు లో బోడి పరిహాసం" లాగున నా కళ్ళముందు లేకుండగనే ఆమె ఈమెను ఆ వూరు తీసుకెళ్తె నా పని కాస్త "నీళ్ళలోని పంది కొక్కుల్లా", వుంటుంది. ఏం చేసేది. విధిలేక గతిలేక విడువలేక దేబి ముఖంతో ఆమెను మా అత్తయ్యతో జతపర్చి, తెనాలికి

పంపేశాను. గత రాత్రి యైనా సుఖం సంతోషం. ఏమి లేదు వుండేదేమో? గాని మా అత్తయ్యా తెల్లవార్లు. గజ్జి కుక్క లాగున ఆ మంచంలో అటు యిటు పొర్లుతూ తెల్లవారే వరకు హరినామ సంకీర్తన, లాగున "క్రిజ్జు" మంచమును "కిజ్జు కిజ్జు" మనిపిస్తు మా సంతోషాల్ని దగ్ధపర్చి పద్మతో గూడా వెళ్లిం దత్తయ్యా.

పద్మను పంపిన రాత్రి నా కంటికి నిదురలేదు. కడుపుకు తిండి అంత కన్నాసై. ఆనందం అసలే సున్నా. ముక్కోటి ఆంధ్ర దేవతల్ని ఒక్కసారి స్మరించాను. వారంతా వచ్చి నా ఎదుట నిల్చుని ఏం? అని ప్రశ్నించారు. ఓ...దేవాది దేవతలారా! నా ముద్దుల భార్యకు గర్భం వచ్చింది. అందుకని ఆమె ప్రసవించుటకు తెనాలి వెళ్లింది, గాన మా యావిడ సుఖంగా ప్రసవించి, శరీరం ఏ మాత్రం పటుత్వం తగ్గక మాణిక్యం లాటి బుడ్డోడిని కనే లాగున వరం యివ్వండి. అలా యివ్వరా? మీలో ఏ మాత్రం మహిమ లేదని ఒక రూపాయి యిచ్చి "దముకు" వేయిస్తాను. దాంతో మీకు నైవేద్యం నై...జాగ్రత్త అని ఒక దబాయింపు దబాయించాను. దాంతో చచ్చినట్లుగా. ఓ...యస్... మిష్టర్! నీ మాట ప్రకారం చేస్తాం. అని అభయం యిచ్చారు. యింతలో వెధవది ఒక గండు చీమ నా చెవి గూబ పట్టేసింది. దాంతో ఆ దేవతలు ఆ వరం ఆ అభయం ఆ సంభాషణలు అన్నీ కలసి ఒకే ఒక్కసారి, అలా అలా వెళ్లి ఆ కృష్ణ బ్యారేజి కి అంకితం అయిపోయి ఒక్కసారి మెలకువ వచ్చింది. ఎదురుగా వున్న గోడ గడియారం 3 గం. 45, నిమిషాలు టైము నిరూపిస్తూ నన్నువెక్కిరిస్తోంది. దాంతో నాకల కాస్త కైలాస యాత్రకు వెళ్లింది. నేనూ నరలోకంలో పడి పోయాను. అంతే మరి కంటికి కునుకే పట్టి చావలేదు. "అర్ధ రాత్రి పిశాచి" లాగున "చిత్రగుప్త"ను తిరగేస్తూ "దయ్యం"లా కూర్చున్నాను.

తెల్లవారింది. ఎప్పటిలా కాలకృత్యాలు తీర్చుకొని అలా పోష్టాఫీసు వైపుగా వెళ్లాను. పోస్టుమెన్ కరీం సాహెబు నన్ను చూడగనే ఒక కార్డు అందించాడు. యింకేం. తెనాలి నుండి దిగిందా కార్డుముక్క. మామగారు దీవించి వ్రాస్తూ నా హృదయేశ్వరి సుఖంగా ప్రసవించిందనీ, అయితే ఆ శిశువు "ఆడది" అనీ, ఆ పాపకు ఒక కన్ను "మెల్ల" అనీ, గుత్తిమున కున్నంత ఒక వీశమెత్తు "గూని" యనీ, వ్రాశారు. ఆ వుత్తరం చూడగానే నాకు ఏడుపు, నిదుర, అవలింపు ఆలోచన, నవ్వు, అన్నీ కలసి ఒకదాని వెంట మరొకటి "దశావతారముల" లాగు వచ్చాయి. నలుగురు మిత్రులకు ఈ శుభ వార్తను ఎలా అందివ్వాలి? ఓ శ్రీరామ చంద్ర మూర్తీ! యింత బ్రతుకు బ్రతికించి, "ఇంటి వెనకాల చంపావేం తండ్రీ?" అని. అనుకొంటూ, దించిన తల ఎత్తకుండా పోష్టాఫీసులో నుండి బైటపడి, నేరుగా యింటి ముఖం కాదు కాదు, వీధి ముఖం పట్టి తిన్నగా కొంప చేరాను.

కొన్నిరోజులు గడిచిపోయాక మాయావిడ మాయింటికి వేంచేసింది. ఆమె వచ్చాక నా ప్రియముద్దులచిన్నారి చిట్టి చిలుక బేబిని చూద్దును గదా? ఓరీ......గోవిందస్వామీ నల్లగా కర్రిమొద్దులాగుంది. "బొగ్గుల్లో రామచిలుక" కన్నా అధ్వాన్నస్థితిగా వుంది నా బేబి. ఛీ...ఛీ... ఈ పాడుబిడ్డ లెందుకురా? ముదనష్టపుమూక ప్రభూ! అని బా...గా తిట్టుకొన్నా. తిట్టినా? కొట్టినా? నాబిడ్డయేగదా? ఇంతకూ! మా యిద్దరి ముచ్చట్లప్రేమఘడియలు పసందైనవి కావన్న మాట. ఇందులో ఎవరిని ఏమని ఏం లాభం. ఆ కర్రిదాన్నే మా యావిడ ఎంతో అల్లారు ముద్దుగా చూస్తూ పౌడర్లు స్నోలు, అద్ది అలంకార "పాండురంగని" విగ్రహంలా ముస్తాబుచేసి మురిసిపోతుంది. పాపం ఆమె పిచ్చి ఆమెది.

కాలక్రమేణ బేబి కాస్త భామయైంది. ఆమె నామధేయం భానుమతి. ఆ భానుమతి, ఆనాటి ఆ గూని మెల్ల కర్రి నల్లపిల్ల ఈనాడు నాకు ముద్దులకన్నబిడ్డయైంది. అబిడ్డ S.S.L.C. చదివి ప్యాసై "గంతకుతగిన బొంత"లా చిన్న ఉద్యోగంచేస్తూ నాకీనాడు యిన్ని గంజినీళ్ళుపోస్తు పోషించి కాపాడుతుంది. ఇంతకూ నా యవ్వనప్రాయాన్ని వృద్ధాప్యంగా మార్పుచేసిన నా అర్ధాంగి పద్మగాని, కాలంగాని, నన్ను పోషిస్తారా? శరీరంలో రక్తాన్ని పీల్చిన భార్యగాని, కాలాన్ని తెచ్చిన ప్రపంచంగాని, నాకు అక్కరకురాలా. మన బిడ్డలు ఎలావున్నా వారిని పోషించవలసిన బరువు బాధ్యత మనపై, మన వృద్ధాప్యకాలంలో మనకు యిన్ని గంజిపోసి వారి "ఋణం" తీర్చుకోవలసిన బాధ్యత వారిది. అంతేగాని బిడ్డలెలావున్నా? యిచ్చిన దేవుడు వారిని మర్చిపోయి వారిని చల్లగాచూచి "నూరేళ్లు" ఆయువును ప్రసాదిస్తే మన కంతేచాలు, భయమేం లేదు ఇందులో ఏముంది పెద్ద సింగనాదం-జీలకఱ్ఱ. యవ్వనదశలోని గాలిమేఘాల్లాంటి చిలిపి "ఊహ"లు కలకాలం నిల్చి పనిచేస్తాయా? శరీర పటుత్వం వున్నంతవరకే. ఆపై బ్యా......బ్యా...... అనుకుంటూ కొడుకు కోడండ్ల-కూతురు అల్లుళ్ళ, సుఖాల కోసం పాటుపడవలసిందే. ప్రతి నరప్రాణి మేఘాల్లాంటి వూహలు, మెఱపులాంటి సిరి, గడియారంలాటి ప్రాణి నిలవవు. అవి కొంతకాలం మాత్రమే, అందుకే ప్రతివారు అవలంబించవలసింది ఏమిటి? అంటే నాలాగున "గాలిమేఘాల"ను అల్లుకొనక "సంతాన" వంతులై "యిహపర" సుఖాలందుకొని సుఖించి జన్మరాహిత్యం చేసుకోమని మనవి. ★